క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న న్యాయవాది అహ్మద్‌బాషా

ఆత్మకూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని న్యాయవిజ్ఞాన సదస్సు ప్యానెల్ అడ్వొకేట్ ఎస్డీ అహ్మద్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా హిల్‌రోడ్డులోని మేదరివీధి కాలనీలోని మహిళలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గిరిజన మహిళలు రాజకీయ రిజర్వేషన్లను వినియోగించుకుంటూ ముందుకొస్తున్నారని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కుటుంబాన్ని చక్కదిద్దినట్టుగానే సమాజాన్ని చక్కదిద్దే సామర్థ్యం మహిళలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ క్లస్టర్ నిర్వాహకురాలు రమణమ్మ, పలువురు గిరిజన మహిళలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మనబడి నాడు–నేడు రెండో విడత పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. నాడు–నేడు రెండో విడత కింద మండలంలోని బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం జీ చెర్లోపల్లి, వడ్డిపాళెం, బిజ్జంపల్లి మెయిన్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిలోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేకాధికారిణి

జలదంకి: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను ఉగాదిలోగా పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని మండల ప్రత్యేకాధికారిణి రమాదేవి అధికారులను ఆదేశించారు. జమ్మలపాళెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాల పురోగతిని శనివారం ఆమె పరిశీలించారు. వివిధ దశల్లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాల లక్ష్యాల సాధనకు అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కాలనీల్లో లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా లబ్ధిదారులకు మెటీరియల్ సరఫరా చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీఓ ఎం శ్రీధర్‌బాబు, హౌసింగ్ ఏఈ ప్రసాద్, జమ్మలపాళెం సర్పంచ్ బుర్రి శ్రీవేణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కావలి డిపో అభివృద్ధికి చర్యలు



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఈడీ ఆదాంసాహెబ్

కావలి రూరల్: కావలి ఆర్టీసీ డిపో అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఈడీ ఆదాంసాహెబ్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణాన్ని ఆర్‌ఎం వెంకటశేషయ్యతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఖాళీ స్థలాలను ఆదాయ వనరులుగా మార్చుకుని డిపోను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ ముందున్న ఖాళీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు టెండర్లు పిలవాలన్నారు. బస్టాండ్ ఆవరణంలో లీజుకిచ్చిన దుకాణాలను పరిశీలించి డిపో మేనేజర్ శ్రీనివాసులకు సూచనలు, సలహాలు అందజేశారు. వారి వెంట ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పంటలు పచ్చగా..రైతు సంతోషంగా..

- పుష్కలంగా సాగునీరు.. విస్తారంగా పంటల సాగు
- 8,600 ఎకరాల్లో వరి
- 1000 ఎకరాల్లో పత్తి సాగు



చేజర్ల మండలంలో సాగుచేసిన వరి పైరు

చేజర్ల: ఈ ఏడాది వరద జలాలతో సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా మారాయి. వర్షాలు సకాలంలో పడడంతో ఒక్క సెంటు భూమి కూడా ఖాళీగా లేకుండా చేజర్ల మండలంలోని రైతులు విస్తారంగా పంటల సాగుచేపట్టారు. ఎన్నడూ లేని విధంగా సుమారు 8,600 ఎకరాల్లో వరి సాగుచేశారు. దీంతో గ్రామాలు పచ్చదనంగా మారాయి.

పంట మార్పిడి

వర్షాలు అధికంగా కురవడంతో మండలంలోని కొన్ని గ్రామాల్లోని నేలలు వరిసాగుకు అనుకూలించలేదు. ఫలితంగా పెళ్లేరు, చేజర్ల, మడపల్లి, వావిలేరు, మడపల్లి, నాగులవెలటూరు, తదితర గ్రామాల్లోని రైతులు పంట మార్పిడి చేపట్టారు. పత్తి ధరలు ఆశాజనకంగా ఉండడంతో వరి సాగును వదిలేసి సుమారు వేయి ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. గతేడాది కంటే ఈ ఏడాది పత్తి సాగు దాదాపు 600 ఎకరాల మేర పెరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

పుష్కలంగా సాగునీరు

ఈ ఏడాది సోమశిల దక్షిణ కాలువ ద్వారా చేజర్ల మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. జలవనరుల శాఖ అధికారులు, సోమశిల ప్రాజెక్ట్ అధికారులు సమన్వయంతో సాగునీటిని కాలువలు, చెరువుల ద్వారా అందిస్తుండడంతో మండలంలోని చివరి ప్రాంతమైన మాముడూరు గ్రామానికి సాగునీరు అందుతోంది. ఫలితంగా మండలంలో ఎక్కడా సెంటు పొలం ఖాళీ లేకుండా రైతులు పైర్లు సాగు చేస్తున్నారు. 2015 తర్వాత మండలంలో పెద్దగా వర్షపాతం లేదు. ఆ తర్వాత 2019 నుంచి వర్షాలు పుష్కలంగా పడుతుండడతో ఏటా వరి పంట సాగుతుండడంతో అన్నదాతలు ఆనందంతో ఉన్నారు. మండలంలో పదిహేను రోజుల తర్వాత కోతలు మొదలయ్యే అవకాశం ఉంది.

విస్తారంగా పంటల సాగు



ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడడంతో పాటు దక్షిణ కాలువ ద్వారా సాగునీరు పుష్కలంగా విడుదల చేయడంతో రైతులు విస్తారంగా పంటల సాగుచేపట్టారు. తెగుళ్ల బెడద తక్కువగా ఉండడంతో పంటలు కళకళలాడుతున్నాయి.

– గంగాల ప్రసాద్, రైతు, పులసీళ్లపల్లి

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



పంటల సాగులో రైతులకు అండగా నిలుస్తున్నాం. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాం. వరి కోతలు ప్రారంభానికి ముందే ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–శశిధర్, ఏఓ

రామావతారంలో ప్రసన్నుడు

- అంజనాద్రీశునికి హనుమంత సేవ



బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ దఫా అంకురార్పణ రోజు నుంచే భక్తుల తాకిడి రోజురోజుకు ద్విగుణీకృతం అవుతోంది. ఉత్సవాల్లో భాగంగా ప్రసన్నుడు శనివారం రామావతారంలో హనుమంత వాహనంపై కొలువుదీరి శనివారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో సాయంత్రం నుంచే కొండపై హడావుడి నెలకొంది. భక్తుల గోవింద నామస్మరణలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారు పట్టుపీతాంబరాలతో అలంకరించిన హనుమంత వాహనాన్ని అధిరోహించి భక్తులకు అభయప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వేదగిరి కళ్యాణచక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సూక్ష్మబుద్ధి, అసమాన ఏకాగ్రత, అపరిమిత బలం, ప్రచండ వాయువేగం కలిగిన హనుమంతుడిపై కొలువుదీరిన స్వామివారు అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలందుకుంటూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఊరేగారు. కలియుగంలో పాపం పెరిగినప్పుడు, దుష్టుల ఆగడాలు మితిమీరినప్పుడు తన రాక తప్పదన్న విషయాన్ని సూత్రప్రాయంగా వెల్లడించేలా సంధించేందుకు సిద్ధంగా ఉన్న రామబాణంతో ఊరేగారు.

అలంకార ప్రియుడికి పూలంగి సేవ

అలంకార ప్రియుడైన ప్రసన్న వేంకటేశ్వర స్వామికి శనివారం రాత్రి నిర్వహించిన పూలంగి సేవ నేత్రపర్వంగా సాగింది. ప్రసన్న వదనంతో కనిపించే స్వామివారిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పాలు, తులసీమాలలతో నిర్వహించిన పూలంగిసేవలో మరింతగా శోభిస్తూ భక్తులకు కనువిందు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మోహిని ఉత్సవం, సాయంత్రం పూలంగి సేవ, రాత్రికి గరుడ వాహనసేవ జరుగుతాయని ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి తెలిపారు.



హనుమంతుని సేవలో ఎమ్మెల్యే రామిరెడ్డి

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో వెంకటరమణారెడ్డి

వింజమూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రముఖ శాస్త్రవేత్త మూల వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లగొండ్ల గుహమల్లేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని శనివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్యం ముడిపడి ఉంటుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని పేదలందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయం సాధించి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు లెక్కల శ్రీనివాసులురెడ్డి, కాటా మాల్యాద్రిరెడ్డి, జీ రఘురామిరెడ్డి, సూరె భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పెన్షనర్స్ సర్వసభ్య సమావేశం రేపు

వింజమూరు: మండల పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీ సుధాకర్‌రావు శనివారం తెలిపారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జరిగే సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. 75 ఏళ్లు పైబడిన పెన్షనర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. పెన్షనర్స్ అందరూ హాజరుకావాలని కోరారు.

తిక్కవరంలో వింత గొర్రెపిల్ల జననం



వింత గొర్రెపిల్లను చూపిస్తున్న రైతు వెంకటేశ్వర్లు

మర్రిపాడు: మండలంలోని తిక్కవరంలో శనివారం ఓ వింత గొర్రెపిల్ల జన్మించింది. గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు జీవాలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన గొర్రెల మందలోని ఓ గొర్రె శనివారం వేకువన ఒకే తల, రెండు మొండాలు, మూడు చెవులు, ఎనిమిది కాళ్లు కలిగిన గొర్రెపిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన వెంటనే గొర్రె పిల్ల మృతి చెందింది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వింతగా గొర్రె పిల్లను తిలకించారు. ఈ విషయమై పశువైద్యసిబ్బందిని సంప్రదించగా జన్యులోపంతో ఇలాంటి పిల్లలు పుడుతాయని పేర్కొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లి పశువైద్యశాల పరిధిలోని 450 పశువులకు పశువైద్య సిబ్బంది శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. మండలంలోని పామూరుపల్లి, తొడుగుపల్లి, జీ కొండారెడ్డిపల్లి గ్రామాల్లోని నాలుగు నెలలు దాటిన పశువులకు రెండు బృందాలు టీకాలతో వేస్తున్నామని చెప్పారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలకు పుస్తకాల వితరణ



గొట్టిగుండాల ఉన్నత పాఠశాలకు పుస్తకాలు అందజేస్తున్న పీజీఎన్‌ఎఫ్ సభ్యులు

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల, కొండాపురం ఉన్నత పాఠశాలలకు ప్రవాస భారతీయుడు జాస్తి శివరామకృష్ణ 29 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రంథాలయాలను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫోరం (పీజీఎన్‌ఎఫ్)ను ఆయన స్థాపించారు. ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పుస్తకాలను పాఠశాలలకు అందజేస్తున్నారు. అందులో భాగంగా కొండాపురం, గొట్టిగుండాల జెడ్పీ ఉన్నత పాఠశాలలకు పుస్తకాలను శనివారం అందజేశారు. ప్రజాసైన్స్‌వేదిక, జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రసాద్, మాల్యాద్రి సహకారంతో గొట్టిగుండాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బొద్దుకూర అమరేంద్ర మాట్లాడారు. పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని, పీజీఎన్‌ఎఫ్ అందజేసిన పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పుస్తకాలు అందజేసిన దాతలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి



ఏఎస్‌పేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటుతో ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం వారు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కలుసుకుని అభ్యర్థించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, నలిశెట్టి శ్రీనివాసులు, నందవరం ప్రతాప్, సురేష్ యాదవ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ పులిమి రమేష్‌రెడ్డి ఏఎస్‌పేట, గుంపర్లపాడు, కావలియడవల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. పార్టీ నాయకులు బోయళ్ల చెంచురెడ్డి, సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అహ్మద్, రంగారెడ్డి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల : అనంతసాగరం మండలంలోని పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి మద్దతుగా ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దుగ్గిరెడ్డి రత్నారెడ్డి, బట్రెడ్డి పోలిరెడ్డి, గుండుబోయిన వెంకటరమణ, ఈశ్వరయ్య, ముక్కు మస్తాన్, తదితరులు ఉన్నారు.

చేజర్ల: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చేజర్లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలుసుకుని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, నాయకులు పాలకొండ వెంకటరత్నారెడ్డి, ఒంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, వంగవరపు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో అందజేయాలి



టీకాల రిజిష్టర్లను పరిశీలిస్తున్న పీహెచ్‌ఎన్

వరికుంటపాడు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో అందించి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడాలని పీహెచ్‌ఎన్ పీ సుశీలమ్మ వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. టీకాల రిజిష్టర్లను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆరోగ్యకార్యకర్తలు టీకాలు వేయాల్సిన వారి జాబితాను ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. టీకాల లక్ష్యాన్ని నూరు శాతం సాధించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకునేలా చైతన్యపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం కవిత, ఆరోగ్య సహాయకుడు రవి పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ తరలింపుపై హర్షం

ఉదయగిరి: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్‌ను హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలించడంపై జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్ఫి యస్దాని శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్‌కు చైర్మన్ నియామకంతో పాటు వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తుల విషయంలోనూ న్యాయం జరుగుతుందన్నారు. హైదరాబాద్ నుంచి కర్నూలుకు ట్రిబ్యునల్ తరలింపు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు జారీచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గ్రావెల్ టిప్పర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

- ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి తీవ్రగాయాలు
- ఘటనా స్థలాన్ని నీటితో రక్తపుచారికలు లేకుండా చేసిన వైనం
- టిప్పర్‌ను తీసుకెళ్లిపోయిన యజమాని



మరణించిన బొగ్గవరపు బ్రహ్మయ్య



తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఇండ్ల ఓబులు

కావలి: గ్రావెల్ టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పట్టణంలోని పెద్దపవని రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. కావలి టూటౌన్ ఎస్‌ఐ జే మాల్యాద్రి కథనం మేరకు.. పట్టణంలోని పెద్ద చెరువు వద్ద ఉన్న పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీకి చెందిన బొగ్గవరపు బ్రహ్మయ్య (28), ఇండ్ల ఓబులు (60), కొమరగిరి సాయి (20) ముగ్గురు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరు మండలంలోని సిరిపురంలో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా సుచేతానగర్ వద్ద పట్టణం నుంచి గ్రావెల్ కోసం వెళ్తున్న టిప్పర్ వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న బొగ్గవరపు బ్రహ్మయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఇండ్ల ఓబులు తీవ్రగాయాలు కావడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. కొమరగిరి సాయికి కాలు విరడగంతో పాటు గాయాలయ్యాయి. కావలి టూటౌన్ ఇన్‌చార్జి సీఐ కె.శ్రీనివాసరావు కూడా ఘటనా ప్రదేశానికి చేరుకుని పరిశీలించారు.

ఆధారాలు చెరిపేసి.. టిప్పర్ మాయం

ఓ వ్యక్తి దుర్మరణానికి కారణమైన టిప్పర్‌ను యజమాని మాయం చేయడమే కాకుండా ఘటనా స్థలంలో ఆధారాలు లభించకుండా రక్తపు చారికలను సైతం నీటితో కడిగేసిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కావలి టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌తో పాటు ఆధారాలు చెరిపేసిన నిందితుడు టిప్పర్ యజమాని కోసం పోలీసులు గాలిస్తున్నారు.



కాలు విరిగి గాయాలైన కొమరగిరి సాయి

దారంతో కళాత్మక చిత్రాలు

ఆయనో ఉపాధ్యాయుడు. తనలోని కళానైపుణ్యంతో కనువిందు చేసే చిత్రాలను రూపొందిస్తున్నారు. కాన్వాస్, రంగులు, కుంచె లేకుండా దారం సాయంతో మనోహరమైన బొమ్మలను తీర్చిదిద్దుతూ ఆకట్టుకుంటున్నారు.



దారాలతో రూపొందించిన సీతారాములు, మహాత్మాగాంధీ, ఛత్రపతి శివాజీ , ఆకుపై చిత్రించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్



ఎం.శివశంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రం గ్రామానికి చెందిన మున్నెళ్లి శివశంకరయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన బూదవాడ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తనలోని కళాభిరుచితో వినూత్నంగా కనువిందు చేసే బొమ్మలను తీర్చిదిద్దుతున్నారు. కాన్వాస్‌లు, రంగులు, కుంచె అవసరం లేకుండానే కేవలం నూలు దారాల సాయంతో ఆకట్టుకునేలా బొమ్మలను రూపొందిస్తున్నారు. ముందుగా పేపర్‌పై బొమ్మను గీస్తారు. దానిపై దారాన్ని అతికించి చూడముచ్చటగా బొమ్మలను తయారు చేస్తారు. ప్రత్యేకంగా అడుగు నుంచి ఆరు అడుగుల వరకు దేవతామూర్తులు, రాజకీయనేతలు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను రూపొందించి అందజేస్తుంటారు. తనలోని చిత్రలేఖన ప్రతిభతో ఆకులపైన చిత్రాలను ఆకట్టుకునేలా గీస్తారు. ఇప్పటికే ఆయన కొన్ని వందల చిత్రాలను తయారుచేశారు. ఆయన రూపొందించిన చిత్రాలకు భారత టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గుర్తింపు లభించింది. ఇండియన్ ఎంపైర్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆయన విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు బొమ్మలను గీయడం నేర్పిస్తూ మన్ననలు అందుకుంటున్నారు. అంతేకాకుండా పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. అలాగే కవయిత్రి మొల్ల రచించిన మొల్ల రామాయణం తాళపత్ర గ్రంథాలను సేకరించి ప్రత్యేకంగా గ్రంథాన్ని రచించారు. మొల్ల జన్మస్థానాన్ని కలువాయి మండలం గోపవరంగా 72 ఆధారాలతో గుర్తించారు. అక్కడి శ్రీకంఠ మల్లేశ్వరదేవస్థానంలో మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.